

సోమశిలలో 71.238 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 71.238 టీఎంసీలు ఉన్నాయి. 2,199 క్యూసెక్కుల వరద వస్తోంది. పెన్నార్ డెల్టాకు 2,520, ఉత్తరకాలువకు 553, దక్షిణకాలువకు 320, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.58,760
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,248
3 శాతం జీఎస్టీతో	రూ.5,405
సవర (8 గ్రా)	రూ.43,240

గరిష్టం/కనిష్టం
30.2 /21.5

వాతావరణం

జిల్లా వ్యాప్తంగా శనివారం ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. పగలు పొడిగా ఉంటుంది. గాలిలో తేమ 69 శాతం ఉంది.

న్యూస్‌రీల్

డిగ్రీ పరీక్షలో నలుగురి డిబార్

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో శుక్రవారం నిర్వహించిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షలో నలుగురు విద్యార్థుల డిబార్ అయినట్లు పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 1,622 మంది విద్యార్థులకు 164 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఉదయగిరిలోని ఎంఆర్ఆర్ డిగ్రీ కళాశాల, నెల్లూరు నగరంలోని చంద్రారెడ్డి డిగ్రీ కళాశాల, నాయుడుపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శ్రీ వేమనలో ఒక్కో విద్యార్థి డిబార్ అయినట్లు తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన మూడో సెమిస్టర్‌కు 11,151 మంది విద్యార్థులకు 935 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

టెన్త్ ఫీజు తాత్కాలిక స్కీమ్ గడువు పెంపు

నెల్లూరు (టౌన్): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి తాత్కాలిక స్కీమ్ కింద ఫీజు చెల్లించేందుకు గడువు పొడిగించినట్లు డీసీఈబీ సెక్రటరీ రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.500 అపరాధ రుసుంతో ఈ నెల 23వ తేదీ వరకు, రూ.1000 అపరాధ రుసుంతో ఈ నెల 27వ తేదీ వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు.

వచ్చే నెల 5న ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

నెల్లూరు (టౌన్): 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి నేషనల్ మీన్స్ కం మెరిట్ (ఎన్ఎంఎంఎస్) స్కాలర్‌షిప్ పరీక్ష వచ్చే నెల 5న జరగనున్నట్లు డీసీఈబీ సెక్రటరీ రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని చెప్పారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల హాల్‌టికెట్లు వెబ్‌సైట్ www.bse.ap.gov.in స్కూల్ లాగిన్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. సంబంధిత ఉపాధ్యాయులు పాఠశాల యూడైస్ కోడ్‌ను ఉపయోగించి లాగిన్ అయి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందజేయాలన్నారు.

డీఈఓగా నారాయణరావు



నెల్లూరు (టౌన్): జిల్లా విద్యాశాఖ ఎఫ్ఏసీ డీఈఓగా నారాయణరావు నియమితులయ్యారు. శుక్రవారం రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం నారాయణరావు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏడీ–1గా ఉన్నారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి డీఈఓగా ఆర్జేడీ సుబ్బారావు గతేడాది నవంబరు 4వ తేదీ నుంచి బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

రేపు స్పెల్‌బీ సెమీఫైనల్స్

తిరుపతి ఎడ్యుకేషన్: సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో స్పెల్‌బీ సెమీ ఫైనల్స్ (మూడో రౌండ్) పరీక్ష ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కేటగిరీల వారీగా తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని హోలీగ్రీన్ పాఠశాలలో నిర్వహించనునున్నట్లు సాక్షి ఈవెంట్స్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ తెలిపారు. ఇది వరకు పాఠశాల, జిల్లా స్థాయిలో నిర్వహించిన స్పెల్‌బీ పోటీల్లో ప్రతిభ చూపి సెమీ ఫైనల్స్‌కు అర్హత సాధించిన తిరుపతి, వైఎస్సార్, నెల్లూరు జిల్లాల విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవ్వాలన్నారు. ఉదయం 10 నుంచి 10.30 గంటల వరకు కేటగిరీ–1, 10.30 నుంచి 11 గంటల వరకు కేటగిరీ–2, 11 నుంచి 11.30 గంటల వరకు కేటగిరీ–3, 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కేటగిరీ–4 విభాగాల్లో పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా వారి స్కూల్ యూనిఫాం, ఐడీ కార్డుతో పాటు పెన్నులు/పెన్సిళ్లు, రైటింగ్ ప్యాడ్‌తో పరీక్ష సమయానికి ముందే చేరుకోవాలని, పరీక్ష ప్రారంభమైన తరువాత అనుమతి ఉండదని ఆయన పేర్కొన్నారు.

ఫ్లెక్సీలు కట్టి ప్రాణాలు తీశారు

- కందుకూరు తొక్కిసలాట ఘటనపై బాధిత కుటుంబాలు, క్షతగాత్రుల ఆవేదన
- ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో జస్టిస్ శేషశయనారెడ్డి కమిషన్ విచారణ
- 27 మంది బాధితులు, ప్రత్యక్ష సాక్షుల నుంచి వాంగ్మూలం నమోదు
- ఎన్టీఆర్ సర్కిల్, గుండంకట్ట రోడ్డు పరిశీలన
- ప్రమాదం జరిగిన స్థలంలో సీన్ టూ సీన్ కమిషన్ ఆరా
- కొందరు ప్రకటించిన పరిహారం అందలేదని కమిషన్ దృష్టికి తెచ్చిన బాధితులు

కందుకూరు పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో అధికారులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న జస్టిస్ శేషశయనారెడ్డి



‘టీడీపీ నేతలు అత్యుత్సాహంతో నిబంధనలకు విరుద్ధంగా రోడ్డును ఇరుకు చేస్తూ ముందుకు ఫ్లెక్సీలు కట్టడంతో మరింత ఇరుకైంది. చంద్రబాబు వాహనం ఒక్కసారిగా ముందుకు రావడంతో జనాలు తోసుకున్నారు. ఒకరిపై ఒకరు పడ్డారు. కొందరు కింద పడడంతో అలజడి రేగింది. తొక్కిసలాటలో ఎనిమిది మంది ప్రాణాలు పోయాయి. ఇంకా చాలా మంది గాయపడ్డారు. ఇంకొందరు పక్కనే ఉన్న చిన్న కాలువలోకి దూకి ప్రాణాలు కాపాడుకున్నారు.’ అంటూ బాధిత కుటుంబాలు, క్షతగాత్రులు హైకోర్టు రిటైర్ జడ్జి జస్టిస్ శేషశయనారెడ్డి ఏకసభ్య కమిషన్ ఎదుట కన్నీరు పెట్టుకున్నారు. కొందరు నాయకులు పరిహారం ఇస్తామని ప్రకటించినా.. ఇంత వరకు సాయం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కందుకూరు: టీడీపీ అధినేత చంద్రబాబు గత నెల 28న కందుకూరు నిర్వహించిన బహిరంగ సభ సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనపై ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ శుక్రవారం విచారణ చేపట్టింది. డ్రోన్ కెమెరాల వీడియోలతో జనం మరింత మంది వచ్చారని చెప్పుకునేందుకు చేసిన చంద్రబాబు ప్రచార యావకు 8 మంది ప్రాణాలు కోల్పోగా, మరో ఎనిమిది మంది గాయపడిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై హైకోర్టు రిటైర్ జడ్జి జస్టిస్ శేషశయనారెడ్డి ప్రమాదం జరిగిన ఎన్టీఆర్ సర్కిల్ గుండంకట్ట రోడ్డును పరిశీలించారు. అనంతరం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ప్రమాద బాధితులు, ప్రత్యక్ష సాక్షుల నుంచి వాంగ్మూలం నమోదు చేశారు. అసలు తొక్కిసలాట ఎలా జరిగిందనే దానిపై కమిషన్ ప్రధానంగా ఆరా తీసింది. బాధితులకు ప్రకటించిన పరిహారం అంతా అందిందా లేదా ఇంకేమైనా ఇబ్బందులున్నాయా అని ప్రశ్నించారు. మృతుల కుటుంబాల నుంచి ఒక్కొక్కరు, క్షతగాత్రుల్లో ఏడుగురు, ప్రత్యక్ష సాక్షులు 12 మంది కమిషన్ ఎదుట హాజరై వాంగ్మూలం ఇచ్చారు. ప్రధానంగా ఇరుకైన రోడ్డులో టీడీపీ నాయకులు అధికంగా కట్టిన ఫ్లెక్సీలతో మరింత ఇరుకై జనాలు ఒక్కసారిగా తోసుకోవడం వల్ల ప్రమాదం జరిగినట్లు బాధితులు కమిషన్ ముందు వివరించారు. చంద్రబాబు వాహనం ఒక్కసారిగా ముందుకు రావడం వల్ల వాహనం వెంట వచ్చిన వారు ముందుకు దూసుకురావడంతో తొక్కిసలాట జరిగిందని కొందరు, ఫ్లెక్సీలు కట్టడం వల్ల రోడ్డు చిన్నదైందని మరికొందరు, ఏర్పాట్లు సరిగా లేవని, పోలీసులు లేరని కొందరు వాంగ్మూలం ఇచ్చినట్లు సమాచారం. అయితే ఈ ఘటనపై ప్రభుత్వ అధికారులెవరినీ ప్రస్తుతానికి కమిషన్ విచారించలేదు. కేవలం ప్రమాద ఘటనపై మాత్రమే వివరాలు సేకరించింది.

బహిరంగ సభ ప్రాంతంలో క్షుణ్ణంగా పరిశీలన

జస్టిస్ శేషశయనారెడ్డి తన బృందంతో కలిసి శుక్రవారం ఉదయమే కందుకూరుకు చేరుకున్నారు. స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో అధికారులు, ఎస్పీ విజయారావు, జేసీ కూర్మనాథ్ నుంచి కొన్ని ప్రాథమిక వివరాలు సేకరించారు. అనంతరం నేరుగా ప్రమాదం జరిగిన ఎన్టీఆర్ సర్కిల్‌కు చేరుకున్నారు. చంద్రబాబు బహిరంగ సభ ఎక్కడ జరగాలి, చంద్రబాబు ప్రసంగ వాహనం ఎక్కడ నిలపాలి, ఎక్కడ నిలిపారు, ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ఎంత దూరం ముందుకు వచ్చారు.. అనే విషయాలను అడిగి తెలుసుకుని స్వయంగా ఆ ప్రదేశాలను జస్టిస్ పరిశీలించారు. ప్రమాదం జరిగిన గుండంకట్ట రోడ్డుకు చేరుకుని ఆ స్థలాన్ని పరిశీలించారు. ఘటన జరిగిన సమయంలో ఆ రోడ్డులో ఎంత మంది ఉన్నారు, ప్రమాదం కచ్చితంగా ఎక్కడ, ఎలా జరిగిందనే విషయాలను సీన్ టూ సీన్‌పై ఆరా తీశారు. ఈ సందర్భంగా కమిషన్ స్థానిక పోలీస్ అధికారులను కొన్ని ప్రశ్నలు వేసినట్లు సమాచారం. చాలా పత్రికల్లో కాలువలో పడి చనిపోయినట్లు వార్తలు వచ్చాయి కదా ఆ కాలువ ఎక్కడ ఉందని ప్రశ్నించినట్లు తెలిసింది. ప్రమాదం జరిగిన సమయంలో కాలువలో ఎంత నీరు ఉందని ఆరా తీశారు. అయితే కాలువలో పడి ఎవరూ చనిపోలేదని, కేవలం తొక్కిసలాట వల్లే ప్రాణాలు కోల్పోయారని కమిషన్‌కు స్థానిక పోలీసులు అధికారులు వివరించారు.



గుండంకట్ట రోడ్డు పక్కన కాలువను పరిశీలిస్తున్న జస్టిస్ శేషశయనారెడ్డి

సుదీర్ఘ విచారణ

అనంతరం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్న జస్టిస్ శేషశయనారెడ్డి నేతృత్వంలోని కమిషన్ సాక్షుల నుంచి వాంగ్మూలం నమోదు చేశారు. ఆ రోజు ఘటనలో మృతి చెందిన 8 మంది మృతుల కుటుంబాల నుంచి ఒక్కొక్కరిని నుంచి వాంగ్మూలం నమోదు చేశారు. గాయపడినలో 8 మందిలో ఏడుగురు హాజరై కమిషన్‌కు వాంగ్మూలం ఇచ్చారు. ప్రత్యక్ష సాక్షులు 12 మందిని విచారించి వాంగ్మూలం నమోదు చేశారు. వీరిని ప్రధానంగా రెండు అంశాలపై ఆరా తీశారు. తొక్కిసలాట ఎలా జరిగింది, మీకు ప్రకటించిన పరిహారం మొత్తం అందిందా లేదా అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొందరు నాయకులు ప్రకటించిన పరిహారం ఇంకా కొంత అందాల్సి ఉందని చెప్పినట్లు సమాచారం. మృతుల కుటుంబాలకు ఇప్పటి వరకు రూ.20 లక్షల నుంచి రూ.23.50 లక్షల వరకు పరిహారం అందిందని కమిషన్ దృష్టికి అధికారులు తీసుకొచ్చారు. కమిషన్ వెంట సబ్‌కలెక్టర్ శోభిక, డీఎస్పీ కండే శ్రీనివాసులు, కందుకూరు, గుడ్లూరు సీఐలు వెంకట్రావ్, సుబ్బారావు, పలువురు ఎస్సైలు, తహసీల్దార్లు, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదం జరిగిన సమయంలో ఆ కాలువలో అడుగు మేర కూడా నీరు లేదని వివరించారు. తప్పించుకోవడానికి కొందరు కాలువలో దూకి ప్రాణాలు కాపాడుకున్నారని కమిషన్‌కు వివరించినట్లు తెలిసింది. అనంతరం ఆ కాలువలను సైతం జస్టిస్ శేషశయనారెడ్డి స్వయంగా వెళ్లి పరిశీలించారు. బహిరంగ సభ జరిగిన సమయంలో ఎంత మంది హాజరయ్యారు, చంద్రబాబు కాన్వాయ్‌తో వచ్చిన వాహనాలను ఎటు వైపు మళ్లించారనే వివరాలను, ప్రమాద స్థలం నుంచి చికిత్స అందించిన హాస్పిటల్ ఎంత దూరంలో ఉందనే వివరాలపై కూడా ఆరా తీశారు. మ్యాపుల ఆధారంగా కమిషన్‌కు ఈ వివరాలను అధికారులు క్షుణ్ణంగా వివరించారు.

బైక్ సైలెన్సర్‌పై పడడంతో ముఖం కాలింది



అందరూ ఒక్కసారి నెట్టడంతో ఒక్కసారిగా బైక్ సైలెన్సర్‌పై పడిపోయాను. దీంతో ముఖం, మెడ భాగంగా బాగా కాలిపోయింది. హాస్పిటల్‌లో చికిత్స చేయించుకుంటున్నాను. ప్రమాదం ఎలా జరిగిందని అడిగారు. నేను కిందపడిపోయిన విషయాన్ని చెప్పాను. గాయపడిన నాకు ఇస్తామన్న పరిహారం ఇంకా ఇవ్వలేదని చెప్పాను.

– రాగమ్మ, గుండ్లపాళెం

పక్కటెముకలు దెబ్బతిన్నాయి



తొక్కిసలాట ఎలా జరిగిందని నన్ను అడిగారు. అందరూ ఒక్కసారిగా నెట్టుకుంటూ ముందుకు రావడంతో నేను కిందపడిపోయానని, నాపై నుంచి జనం తొక్కుకుంటూ వెళ్లడంతో పక్కటెముకలు విరిగినట్లు చెప్పాను. కావలిలో గాయాలకు చికిత్స చేయించుకుంటున్నానని, ఇంకా తగ్గలేదని చెప్పాను.

– గోచిపాతల రమేష్, మోచర్ల

ఉగాది గృహ ప్రవేశాలకు సీఎం రాక

- ఉగాది నాటికి లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలి
- ప్రతి శనివారం హౌసింగ్ డే
- లక్ష్యం పూర్తి చేసిన వారికే అవార్డులు
- కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

నెల్లూరు (పొగతోట): ఉగాది నాటికి జిల్లాలో జరిగే గృహ ప్రవేశాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే అవకాశం ఉందని కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు చెప్పారు. శుక్రవారం స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంపై ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, హౌసింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. హౌసింగ్ ప్రగతిలో రాష్ట్ర స్థాయిలో జిల్లా చివరిలో ఉందన్నారు. అధికారుల నిర్లక్ష్యం, క్షేత్రస్థాయిలో పరిశీలన లేకపోవడంతోనే ప్రగతిలో వెనుకబడి ఉన్నామని అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. బిల్లుల చెల్లింపు, నిర్మాణాల ప్రగతికి సంబంధించి ప్రతి సమావేశంలో సమస్యలు అడుగుతున్నామన్నారు. లేఅవుట్లలో సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని ప్రత్యేకాధికారులకు సూచించారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి బెస్‌మెంట్ రెండు అడుగులే ఉండాలన్నారు. ఉగాదిలోపు నియోజకవర్గాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలన్నారు. గృహ ప్రారంభోత్సవాలకు సంబంధించి రాష్ట్ర స్థాయి కార్యక్రమం జిల్లాలో నిర్వహించే అవకాశం ఉందన్నారు. నెల్లూరు అర్బన్, రూరల్, కావలి ప్రాంత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అన్ని నియోజకవర్గాలు, మండలాల్లో స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించి గృహ ప్రారంభోత్సవాలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. పీఎం ఈవై నిర్మాణాలు ఆశించిన స్థాయిలో లేవన్నారు. నెల్లూరుకు సంబంధించి 11,627 ఇళ్లు ఇంకా ప్రారంభం కాలేదన్నారు. మంజూరు చేసి రెండేళ్లు అవుతుందన్నారు. రెండు వారాల్లోపు నిర్మాణాలు ప్రారంభించకపోతే పట్టాలు రద్దు చేస్తామన్నారు. ఈ విషయంపై లబ్ధిదారులతో చర్చించి నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి శనివారం హౌసింగ్ డే నిర్వహించాలని, ప్రతి వారం హౌసింగ్ నిర్మాణాలపై సమీక్ష ఉంటుందన్నారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారులకు అవసరమైన నాణ్యమైన ఇసుక, బ్రిక్స్, సిమెంట్ ఇతర వస్తువుల సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. బ్రిక్స్ ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. హౌసింగ్ నిర్మాణాల ప్రగతి వివరాలు అప్‌లోడ్ చేయడంలో మండల స్థాయి అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారన్నారు. ప్రతి రోజు వివరాలు అప్‌లోడ్ చేయాలని సూచించారు. హౌసింగ్ నిర్మాణాలకు సంబంధించి సిల్ట్ సరఫరాలో సెబ్ అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. బిల్లులకు సంబంధించిన వివరాలు తెలపమని అధికారులను కలెక్టర్ ప్రశ్నించారు. సమాచారం ఇవ్వకపోవడంతో సమావేశాలకు ఎందుకు వస్తారంటూ అసహనం వ్యక్తం చేశారు. రిపబ్లిక్ డేకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసిన వారికే అవార్డులు ఇస్తామన్నారు. సచివాలయాలను పరిశీలించి అక్కడ ఉండే సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బయోమెట్రిక్ అటెండెన్స్ విషయంలో అందరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అధికారులందరూ సమన్వయంతో పని చేసి హౌసింగ్ నిర్మాణాల్లో జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జేసీ కూర్మనాథ్, సెబ్ జేడీ శ్రీలక్ష్మి, నగరపాలక సంస్థ కమిషనర్ హరిత, జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు వెంకటరావు, సాంబశివారెడ్డి, నూడా వైస్ చైర్మన్ బాపిరెడ్డి, జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

రాతపరీక్షకు పటిష్ట బందోబస్తు



- ఎస్పీ సీహెచ్ విజయారావు

నెల్లూరు (క్రైమ్): ఏపీఎస్ఎల్‌పీఆర్‌బీ నిర్వహించబోయే కానిస్టేబుల్స్ ప్రిలిమినరీ రాత పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశామని ఎస్పీ సీహెచ్ విజయారావు వెల్లడించారు. పరీక్షల ఏర్పాట్లు, ప్రణాళికలపై ఎస్పీ శుక్రవారం విలేకరులకు వెల్లడించారు. నెల్లూరు పరిధిలో 44, కావలి పరిధిలోని 8 మొత్తంగా 52 పరీక్ష కేంద్రాల్లో ఈ నెల 22 ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరగనుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 20,952 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారని చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి ఘటనలకు తావు లేకుండా 500 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఎస్ఐ స్థాయి అధికారిని నియమించామని, సీఐ స్థాయి అధికారులతో 10 రూట్ మొబైల్స్‌ను, ఏఎస్పీల నేతృత్వంలో ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు సకాలంలో చేరుకునేందుకు ఆర్టీసీ ద్వారా 50 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9 నుంచే అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. 10 గంటల తర్వాత నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించేదిలేదని స్పష్టం చేశారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్లతో పాటు గుర్తింపు కార్డు, బులుగు లేదా నలుపు రంగు బాల్ పెన్నులు మాత్రమే తీసుకురావాలని తెలిపారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వాచ్‌లు ఇతర వస్తువులు పరీక్ష హాలుకు అనుమతించేదిలేదన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. కానిస్టేబుల్స్ ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని, ఉద్యోగాలిప్పిస్తామంటూ దళారులు మోసగించే అవకాశం ఉందని వారిని నమ్మొద్దని సూచించారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- గృహ సారథుల ద్వారా మరింత ముందుకు
- ఎవరెన్ని పాదయాత్రలు చేసిన ప్రయోజనం శూన్యం
- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే ఎప్పటికీ సీఎం
- కో–ఆర్డినేటర్ బాలినేని



మాట్లాడుతున్న మంత్రి కాకాణి చిత్రంలో బాలినేని శ్రీనివాసరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, గురుమూర్తి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

నెల్లూరు (సెంట్రల్): అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకుని రాజకీయ పార్టీలకు అతీతంగా, కుల, మతాల వివక్ష లేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింతగా తీసుకుని వెళ్లాలని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు, తిరుపతి ఎంపీలు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మద్దెల గురుమూర్తి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మానుగుంట మహీధర్‌రెడ్డితో కలిసి జగనన్న సచివాలయం కన్వీనర్స్, గృహ సారథులు (జేసీఎస్)లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత పటిష్టంగా చేయడంతో క్రియాశీలకంగా ఉండే విధంగా అందరం కలిసి కష్టపడి పనిచేయాలన్నారు. గృహసారథులు, కన్వీనర్స్ అందరూ కలిసి ప్రతి సంక్షేమాన్ని పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లేందుకు కృషి చేయాలన్నారు.

జగనే శాశ్వత సీఎం

కొంత మంది పాదయాత్రల పేరుతో వస్తున్నారని, ఎవరెన్ని పాదయాత్రలు చేసినా ప్రయోజనం శూన్యమన్నారు. ప్రజలందరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను తిరిగి మళ్లీ కోరుకుంటున్నారని, ఎప్పటికీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే ఉంటారన్నారు. ఇప్పటికే అనేక సంక్షేమ పథకాలతో పాటు, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని, రానున్న రోజుల్లో మరింతగా ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. అన్ని నియోజకవర్గాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో నాయకులతో సమావేశాలు నిర్వహించి అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకుపోతామన్నారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరం కష్టపడి, ఐక్యమత్యంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. అందరికీ అందుబాటులో ఉంటామని, సమస్యల పరిష్కారం చేసుకుంటూ ముందుకు పోతామన్నారు. ప్రతి నియోజకవర్గంలో సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు. జేసీఎస్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ పుత్తా శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని జేసీఎస్‌లో ఉన్న ప్రతి ఒక్కరిని సమన్వయం చేసుకుంటూ ముందుకు పోవాలన్నారు. ప్రత్యేక యాప్ ద్వారా ప్రతి ఒక్కరిని నిత్యం సమన్వయం చేయడంతో పాటు, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం జేసీఎస్‌లో ఉన్న వారికి రానున్న రోజుల్లో మంచి రాజకీయ భవిష్యత్ ఉంటుందన్నారు.

క్లుప్తంగా

జ్వరపీడితులను గుర్తించండి

- డీఎంహెచ్‌ఓ పెంచలయ్య



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

సంగం: గ్రామాల్లో ఎవరైనా జ్వరాలతో బాధపడుతుంటే వెంటనే గుర్తించి పీహెచ్‌సీలకు పంపాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య ఆదేశించారు. మండల కేంద్రమైన సంగంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం పెంచలయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. డ్రైడే కార్యక్రమాన్ని వైద్యాధికారిణి ప్రతిమతో కలిసి పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. జ్వరపీడితులు త్వరగా పీహెచ్‌సీల్లో చికిత్స పొందేలా చూడాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట హెల్త్ సూపర్‌వైజర్ షేక్ జలీల్ అహ్మద్, వసంతమ్మ, హెల్త్ అసిస్టెంట్లు టి.మాధవరావు, అనిల, అన్నమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి: రూ.30
సన్నవి: రూ.17
పండ్లు: రూ.8

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 122
లేయర్ (లైవ్) : 95
బ్రాయిలర్ చికెన్ : 214
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 238
లేయర్ చికెన్ : 162

వాటర్ ప్లాంట్లలో నిబంధనలు గాలికి..

- విజిలెన్స్ తనిఖీల్లో వెలుగులోకి..
- ఆరు ప్లాంట్లపై కేసుల నమోదు



పడుగుపాడులోని ప్లాంట్‌లో వాటర్ ప్యాకెట్‌ను పరిశీలిస్తున్న రాజేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): నిబంధనలకు విరుద్ధంగా మినరల్ వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. కనీస ప్రమాణాలు పాటించకుండా ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. దీనిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దృష్టి సారించింది. ఆ శాఖ డీజీ ఆదేశాల మేరకు శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా అధికారులు మినరల్ వాటర్ ప్లాంట్లలో తనిఖీలు నిర్వహించారు. అందులో భాగంగా నెల్లూరు ప్రాంతీయ నిఘా, అమలు అధికారి కె.రాజేశ్వరరెడ్డి పర్యవేక్షణలో విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ, ఫుడ్‌సేఫ్టీ అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నెల్లూరు, కోవూరుల్లోని ఏడు మినరల్ వాటర్‌ప్లాంట్లను తనిఖీ చేశారు.

వీటిపై చర్యలు

నెల్లూరు నవలాకులతోటలోని ఎస్‌ఎస్ మినరల్ వాటర్ ఇండస్ట్రీ, అల్లీపురం మేకలవారివీధిలోని శ్రీలక్ష్మీ వినాయక ఇండస్ట్రీస్, బలరామపురంలోని జేకే ఇండస్ట్రీస్, కోవూరు మండలం చెర్లోపాళెం రోడ్డులో ఉన్న ఎంఎస్ మేద్యాశ్రీ ఆక్వాటెక్, పడుగుపాడు సెంటర్‌లోని జీఎంఆర్ ఇండస్ట్రీస్, చిన్నపడుగుపాడులోని శ్రీ షిర్డీ సాయినాథ ఎస్‌ఎస్‌ఎస్ ప్యూరిఫైడ్ డ్రికింగ్ వాటర్ యజమాన్యాలు లైసెన్స్‌లు లేకుండా, రికార్డులు నిర్వహించకుండా, కనీస ప్రమాణాలు పాటించకుండా నిర్వహిస్తున్నారని అధికారులు గుర్తించారు. ఫుడ్‌సేఫ్టీ అధికారులు తాగునీటి శాంపిల్స్ సేకరించి నాణ్యత పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని స్టేట్ ఫుడ్ ల్యాబ్‌కు పంపారు. ప్యాకింగ్ లైసెన్స్, ప్యాకింగ్‌పై సరైన వివరాలు నమోదు చేయకపోవడంతో లీగల్ మెట్రాలజీ అధికారులు చట్టపరంగా వారిపై కేసులు నమోదు చేశారు. సదరు ప్లాంట్లపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నామని రాజేశ్వరరెడ్డి తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్‌లు వి.సుధాకర్‌రెడ్డి, పి.పెంచలరెడ్డి, వ్యవసాయాధికారి బి.సంగమేశ్వరరెడ్డి, ఎఫ్ఆర్‌ఓ కె.గోపాలకృష్ణ, డీసీటీఓ విష్ణురావు, ఏజీ సీహెచ్ సుబ్బయ్య, ఏఈ వెంకటరెడ్డి, లీగల్ మెట్రాలజీ అధికారులు జి.సాయిశ్రీకర్, కరిముల్లా, ఫుడ్‌సేఫ్టీ అధికారులు ప్రణతి ఫ్లోరా, డి.నీరజ పాల్గొన్నారు.

సోమిరెడ్డి.. బహిరంగ చర్చకు సిద్ధమా?

- వైఎస్సార్‌సీపీ నాయకుల సవాల్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నెల్లూరు (సెంట్రల్): టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మంత్రిగా పనిచేసిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అవినీతికి పాల్పడ్డారు. ఆయన హయాంలో జరిగిన అభివృద్ధి శూన్యం. దీనిపై బహిరంగ చర్చకు రావాలని సోమిరెడ్డికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య సవాల్ విసిరారు. నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని కందలంపాడు, పుల్లతీగలపాడు ప్రాంతాల్లో దారికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, బ్రిడ్జిలు నిర్మించాలని రెండు గ్రామాల రైతులు సోమిరెడ్డికి గతంలో ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని విమర్శించారు. ఆ రెండు గ్రామాలకు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బ్రిడ్జిలను మంజూరు చేయించారని, మూడు నెలల్లో బ్రిడ్జి నిర్మాణాలు పూర్తైనట్లు చెప్పారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఎక్కడా సాగు, తాగునీటి సమస్యల్లేవన్నారు. ఈ ఘనత మంత్రి కాకాణిదని కొనియాడారు. మంత్రి 300 ఎకరాల్లో ప్యాలెస్ నిర్మిస్తున్నారని సోమిరెడ్డి అనడాన్ని చూస్తే ఆయనకు మతిభ్రమించిందని అర్థమవుతోందన్నారు.

దిగజారుడుతనానికి నిదర్శనం

కనుపూరు కాలువకు సంబంధించి 2015 నుంచి 2019 వరకు రూ.66.81 కోట్ల పనులు చేశామని లెక్కలు చెప్పారన్నారు. అప్పట్లో ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి కనుపూరు కాలువ వద్దకు ఇరిగేషన్ అధికారులను తీసుకెళ్తే పనులేమి జరిగలేదనే విషయం బహిర్గతం చేసిన విషయం గుర్తు లేదా అని ప్రశ్నించారు. 2019 నుంచి ఇప్పటి వరకు రూ.31.8 కోట్లతో పనులు చేస్తే, అందులో రూ.13.81 కోట్ల మేర బిల్లులు చెల్లించారని గుర్తుచేశారు. అయితే రూ.30 కోట్ల అవినీతి జరిగిందని సోమిరెడ్డి మాట్లాడడం చూస్తుంటే ఆయన ఎంత అబద్ధాలకోరో అర్థమవుతోందన్నారు. కనుపూరు కాలువ కింద ఉన్న ఏ ఒక్క రైతు కూడా ఆయన వెంట లేరని, డబ్బులిచ్చి కాలువ వద్దకు తీసుకొచ్చిన కూలీలతో మాట్లాడించడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శమన్నారు. సోమిరెడ్డి తలకిందులుగా తపస్సు చేసినా కాకాణిపై అవినీతి మరక వేయలేరన్నారు. ఆయన చెప్పే ప్రతి మాటను కనుపూరు కాలువ వద్దకు వచ్చి నిరూపించాలని సవాల్ విసిరారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

అత్తను హత్య చేసిన అల్లుడి అరెస్ట్



మాట్లాడుతున్న సీఐ రామారావు

బుచ్చిరెడ్డిపాళెం: మద్యానికి డబ్బులు ఇవ్వలేదని అత్త గద్దె సుబ్బమ్మను హత్య చేసిన అల్లుడు గుంటపల్లి నారాయణను శుక్రవారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచామని సీఐ జి.రామారావు తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెంలోని తన కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈనెల 18వ తేదీన బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని వవ్వేరు గ్రామానికి చెందిన సుబ్బమ్మను ఆమె అల్లుడు నారాయణ రోకలిబండతో కొట్టి హత్య చేశాడు. ఆమె చేతికి ఉన్న పచ్చరాయి ఉంగరంతోపాటు చెవి కమ్మలను తీసుకుని పరారయ్యాడు. శుక్రవారం మండలంలోని జొన్నవాడ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. సమావేశంలో ఎస్సై వీరప్రతాప్, సిబ్బంది పాల్గొన్నారు.

అద్దెకు ఆర్టీసీ ఖాళీ స్థలాలు

- ఆర్టీసీ జోన్–3 పరిధిలో 31 చోట్ల..
- 25న నెల్లూరులో సదస్సు

నెల్లూరు(క్రైమ్): ఏపీపీటీడీ (ఆర్టీసీ) నెల్లూరు జోన్–3 పరిధిలోని 31 ఖాళీ స్థలాలను పదిహేనేళ్ల కాలవ్యవధితో వ్యాపార నిమిత్తం అద్దె ప్రాతిపదికన కేటాయించేందుకు టెండర్లు పిలవడం జరిందని ఈడీ అదాం సాహెబ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్ వేసే విధానం, సందేహాలను నివృత్తి చేసేందుకు ఈనెల 25వ తేదీన నెల్లూరు ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌లోని జిల్లా ప్రజా రవాణాధికారి (ఆర్‌ఎం) కార్యాలయంలో ఉదయం 11 గంటలకు అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు. ఔత్సాహిక వ్యాపారవేత్తలు ఈ సమావేశానికి హాజరుకావాలన్నారు. వ్యాపారస్తులు నెల్లూరు నగరంలోని ఈడీ కార్యాలయంలో ఫిబ్రవరి 3వ తేదీన ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బాక్స్‌లో టెండర్లు వేయాలన్నారు. నెల్లూరు రీజియన్‌లోని వివిధ బస్టాండ్లలో ఖాళీగా ఉన్న ఏడు స్థలాలకు టెండర్లు పిలిచామని జిల్లా ప్రజారవాణాధికారి పీవీ శేషయ్య మరో ప్రకటనలో తెలియజేశారు.

క్రికెట్ ఆడుదాం.. ప్రతిభ చాటుదాం

ఈ నెల 22 సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ

SAKSHI — SAKSHI DIGITAL — MEDIA GROUP

SPL — SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

Regional sponsor

APMDC — APMDC FOUNDATION

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్‌ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు : 98489 97210

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

తండ్రి మరణంపై అనుమానం

- మృతికి గల కారణాలు బయటపెట్టాలి
- పోలీసులకు కుమార్తెల ఫిర్యాదు

నెల్లూరు(క్రైమ్): వృద్ధుడు అనారోగ్యంతో మృతిచెందాడు. అయితే మృతికి గల కారణాలు వెలికితీయాలని కుమార్తెలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరులోని శెట్టిగుంటరోడ్డు వీవర్స్‌కాలనీకి చెందిన ఎస్.వెంకటరమణయ్య (70), సుగుణమ్మ దంపతులకు విజయలక్ష్మి, రమ, ఉమ, నిర్మల అనే కుమార్తెలున్నారు. వారందరికీ వివాహం చేశారు. కొంతకాలంగా దంపతులు రెండో కుమార్తె రమ వద్ద ఉంటున్నారు. వెంకటరమణయ్య హృద్రోగ, ఊపిరితిత్తుల తదితర వ్యాధులతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల 19వ తేదీ రాత్రి ఆయన అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. దీంతో భార్య, కుమార్తె 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని వెంకటరమణయ్యను పరిశీలించగా అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న మిగిలిన కుమార్తెలు ఇంటి వద్దకు చేరుకుని తమ తండ్రి మరణం అనుమానాస్పదంగా ఉందని పేర్కొన్నారు. తన భర్త అనారోగ్యంతో మృతి చెందాడని సుగుణమ్మ శుక్రవారం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే తండ్రి మృతికి గల కారణాలను వెలికితీయాలని కుమార్తెలు పోలీసులను కోరారు. వారు కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.

ఆర్టీసీకి 'సంక్రాంతి' రాబడి రూ. 83 లక్షలు

- సాధారణ చార్జీలతో పెరిగిన ఆదరణ



నెల్లూరు(క్రైమ్): సంక్రాంతి పండగ ఏపీపీటీడీ (ఆర్టీసీ)కి రాబడి తెచ్చిపెట్టింది. ప్రయాణికుల కోసం ఈనెల 6 నుంచి 19వ తేదీ వరకు నెల్లూరు రీజియన్ నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నైతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు అధికారులు ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేశారు. సాధారణ చార్జీలే వర్తింపచేయడంతో ప్రయాణికుల ఆదరణ పెరిగింది. దీంతో నెల్లూరు రీజియన్‌కు రూ.83 లక్షల మేర రాబడి లభించింది.

263 ప్రత్యేక సర్వీసులు

సంక్రాంతి పండగకు ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చేవారి కోసం ఆర్టీసీ అధికారులు ఈనెల 6 నుంచి 14వ తేదీ వరకు 176 ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపారు. వాటిలో హైదరాబాద్ నుంచి 94, బెంగళూరు నుంచి 26, విశాఖపట్నం నుంచి 20, విజయవాడ నుంచి 14, కడప, తిరుపతి నుంచి 20, చెన్నై, కర్నూలు నుంచి ఒక్కో బస్సు నడిపారు. వీటి ద్వారా సంస్థకు రూ.57.50 లక్షలు వచ్చింది. పండగలు ముగిసన తర్వాత తిరుగు ప్రయాణం నిమిత్తం ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు 87 ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపారు. హైదరాబాద్‌కు 46, బెంగళూరుకు 25, చెన్నైకు 6, విజయవాడకు 5, విశాఖపట్నంకు 3, కర్నూలుకు రెండు బస్సులను నడపగా సంస్థకు రూ.28.50 లక్షలు వచ్చింది. మొత్తంగా పండగ సందర్భంగా నెల్లూరు రీజియన్ నుంచి 263 అదనపు బస్సులు నడపగా రూ.86 లక్షల రాబడి వచ్చింది. ప్రత్యేకంలోనూ సాధారణ చార్జీలే తీసుకోవడంతో ప్రయాణికుల నుంచి అధిక ఆదరణ లభించిందని ప్రజారవాణా సంస్థ అధికారి పీవీ శేషయ్య శుక్రవారం తెలిపారు.

రేబాల మాజీ సర్పంచ్ మృతి



యర్రంరెడ్డి వెంకటరమణారెడ్డి (ఫైల్)



నివాళులర్పిస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

- నివాళులర్పించిన ఎంపీ ఆదాల

బుచ్చిరెడ్డిపాళెం: జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, రేబాల వైఎస్సార్‌సీపీ నాయకుడు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి తండ్రి మాజీ సర్పంచ్ యర్రంరెడ్డి వెంకటరమణారెడ్డి (101) అనారోగ్యంతో శుక్రవారం కన్నుమూశారు. ఆయన 1963లో రేబాల, నాగమాంబపురం, నాగాయగుంట ఉమ్మడి గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా పనిచేశారు. మృతి విషయం తెలుసుకున్న నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి రేబాల గ్రామానికి వెళ్లి నివాళులర్పించారు. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డికి ఫోన్ చేసి పరామర్శించారు. అలాగే సీపీఎం నాయకులు వెంకమరాజు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నివాళులర్పించారు. శనివారం ఉదయం రేబాలలో అంత్యక్రియలు నిర్వహిస్తామని గోవర్ధన్‌రెడ్డి తెలిపారు.